క్లుప్తంగా

కార్పొరేటర్లకు తొత్తుగా కేంద్ర ప్రభుత్వం



పేర్నమిట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి కార్పొరేటర్లకు తొత్తుగా వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు విమర్శించారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించి కార్పొరేటర్లకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించినట్లు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గపు చర్యని విమర్శించారు. కార్మికులకు ఉపాధినిచ్చే ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు తగ్గిస్తున్నట్లు వాపోయారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లు అమల్లోకి తేవడం మరింత దారుణమన్నారు. సామాన్యులకు బడ్జెట్లో కోతలు విధిస్తూ, మరో వైపు ప్రజల మీద భారాన్ని మోపారన్నారు. సంపద మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు కట్టబెట్టేందుకు నడుం బిగించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్నా వెంకట సుబ్బారావు, దాసరి చిన్నబాబు, టి.సుబ్బారావు, యు.రామకృష్ణ, కే రామకృష్ణారెడ్డి, ఏ కోటేశ్వరరావు, బీవీ రమణారావు, జె.వీర నారాయణ, డి.వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతగానితనంతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నివర్గాల వారు అష్టకష్టాలు పడుతున్నారు. చివరకు వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయులకు ఉపయోగపడే పింఛన్లు వంటివాటిని కూడా కొత్తవారికి మంజూరు చేయకుండా సీఎం చంద్రబాబు పక్కన పెట్టేయడంతో వారంతా తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా కొత్త పింఛన్లకు అర్హులైన వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వారు దరఖాస్తు చేసుకునేందుకు నేటికీ వెబ్సైట్ ప్రారంభం కాకపోవడమే అందుకు నిదర్శనం.

కొత్త పింఛన్.. పరేషాన్..!

- చీమకుర్తి మండలంలో భారీ సంఖ్యలో కొత్త పింఛన్లకు అర్హులు
- కూటమి ప్రభుత్వం సంబంధిత వెబ్సైట్ కూడా ఓపెన్ చేయకపోవడంతో అవస్థలు
- అధికారంలోకి వచ్చి 8 నెలలైనా పట్టించుకోకపోవడంతో విమర్శలు
- మండలంలోని సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియలా అమలైన కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు

చీమకుర్తి రూరల్:

చీమకుర్తి మండలంలో కొత్తగా పింఛన్లకు అర్హత పొందిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్లకు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వెబ్సైట్ ప్రారంభం కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలు కొత్త పింఛన్లతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా వెరిఫికేషన్ పేరుతో ఇప్పటికే ఉన్న పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో మండలంలోని లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు...

మండలంలోని మంచికలపాడు గ్రామానికి చెందిన రావూరి హనుమంతరావు అనే వృద్ధుడికి ఐదు నెలల క్రితమే 60 సంవత్సరాల వయసు నిండింది. పింఛన్కు అర్హత వచ్చింది కదా అని దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే ఇంకా వెబ్సైట్ ఓపెన్ కావడం లేదన్నారని వాపోయాడు. మంచికలపాడు గ్రామానికే చెందిన కొండ్రు తిరుపతమ్మ అనే మహిళకు 60 సంవత్సరాలు. వితంతు పింఛన్ కోసం ఎనిమిది నెలల నుంచి సచివాలయం, కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. కానీ, పింఛన్కు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్సైట్కు అనుమతులు రాలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేస్తోంది. పాటిమీదపాలెం గ్రామానికి చెందిన కూడలి రోశమ్మ తన భర్త చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళ్లి సిబ్బంది చెప్పిన సమాధానం విని తీవ్ర నిరాశకు గురైంది. చీమలమర్రి గ్రామానికి చెందిన ఆవులూరి సతీష్ కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయానికి వెళ్లినా నిరుత్సాహం తప్పలేదు. ఇలా మండలంలో కొత్త పింఛన్లకు అర్హులైన వారు తమకు పింఛన్ పొందే భాగ్యం ఉందో..లేదో అని చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఎనిమిది నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ వెబ్సైట్లు



గతేడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్తో ఆగిన వెబ్సైట్లు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ కాకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రజలు సచివాలయాలకు వెళ్లి నిలదీస్తున్నారు. 2024 జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– పెరికల నాగేశ్వరరావు, సర్పంచ్, మంచికలపాడు

సచివాలయాల సేవలు ఎప్పుడో



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తవుతున్నప్పటికీ సచివాలయాల ద్వారా సామాన్యుడికి ఒక్క పనీ కావడం లేదు. ఏ పనీ అవ్వక, వెబ్సైట్లు ఓపెన్ కాక సామాన్యుడి బాధలు అన్నీ ఇన్నీ కావు. ఇవన్నీ పట్టించుకోని ప్రభుత్వం సామాన్యుడి ప్రభుత్వం కాదు. సచివాలయాల ద్వారా గత ప్రభుత్వంలో మాదిరిగా అన్ని సేవలు అందుబాటులోకి ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– జడ మరియదాసు, చీమలమర్రి

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న పింఛన్ల తొలగింపు



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు. సంపద సృష్టించే వ్యవహారం ఇక చెప్పనక్కర్లేదు. సామాన్యులకు కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న పింఛన్లు తొలగించే పనిలో పడిన కూటమి ప్రభుత్వం.. ఇప్పటికైనా కళ్లుతెరిచి సచివాలయాల ద్వారా అన్ని సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– కూడలి మాలకొండయ్య, పాటిమీదపాలెం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి. ప్రభుత్వం అనుమతులిచ్చి వెబ్సైట్ ప్రారంభించిన తర్వాతే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. అంతవరకు సంయమనం పాటించాలి.

– కె.రాఘవేంద్ర, ఎంపీడీఓ, చీమకుర్తి

సామాన్య ప్రజల సమస్యలు పట్టించుకోని కూటమి సర్కార్



అధికారంలోకి రాగానే ఎన్నికల వేళ చెప్పిన సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. తీరా చూస్తే సామాన్య ప్రజ సమస్యలు పట్టించుకోకపోగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న అరాచక పాలన గమనిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు అప్పుడే సిద్ధమవుతున్నారు.

– కర్నాటి హరిబాబు, సర్పంచుల సంఘ చీమకుర్తి మండల అధ్యక్షుడు

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే దరఖాస్తులు, పింఛన్లు...

గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు ప్రక్రియను నిరంతరం కొనసాగించారు. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అర్హుల నుంచి అవసరమైన పత్రాలు స్వీకరించి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అనంతరం కూడా ఇంటి వద్దకే వచ్చి ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్ అందించారు. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసలు ఆ వెబ్సైటే ఓపెన్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా ప్రజాసంక్షేమాన్ని నీరుగారుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పింఛన్ల దరఖాస్తు చేసుకునేందుకు నిత్యం సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని అర్హులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా కొత్తగా వివాహాలైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా వెబ్ సైట్ ఓపెన్ కాకపోవడంతో ఎదురు చూపులు చూస్తున్నారు.

శాస్త్రోక్తంగా శివాలయం వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక సమతానగర్లో సాగర్ కాలువ వద్ద గల దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నేలంబొట్ల మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో వార్షికోత్స అర్చకుడు రాము, వేద పురోహితుడు ఈమని సుబ్రహ్మణ్యం ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పది గంటలకు శివలింగానికి పంచామృతాభిషేకం, గణపతి, నవగ్రహ నక్షత్ర రుద్ర హోమాలను శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు శివపార్వతుల కళ్యాణ క్రతువును నయన మనోహరంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరుడి అనుగ్రహం పొందారు. ములగ తిరుపతయ్య, పద్మావతి ఆలయ ధర్మకర్తల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు.



ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న దుర్గామల్లేశ్వరస్వామి

తెలుగు జాతి కీర్తి పతాక శ్రీకృష్ణదేవరాయలు

ఒంగోలు మెట్రో: దేశ భాషలందు తెలుగు లెస్స అని ఎలుగెత్తి చాటిన తెలుగు జాతి కీర్తి పతాక శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తితో మనమందరం తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని సాహితీ లోకం పిలుపునిచ్చింది. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీకృష్ణ దేవరాయుల 554వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ 500 ఏళ్ల నాడే తెలుగు భాషకు, తెలుగు జాతికి, తెలుగు నేలకు విశిష్టత ఖ్యాతి కల్పించిన రాయలవారిని స్మరించుకోవాల్సిన బాధ్యత యావత్ తెలుగు జాతిపై ఉందన్నారు. సంగీతం, సాహిత్యం చిత్రలేఖనం, నాట్యం, శిల్పం వంటి లలిత కళలకు కృష్ణరాయల పరిపాలన స్వర్ణ యుగం లాంటిది అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డా.నారపుశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని చేకూర్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ తాను చేసిన ఏ యుద్ధంలోనూ ఓటమి ఎరుగని చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలని, యుద్ధ విరామ సమయాల్లో కవి సమ్మేళనాలు, సాహితీ గోష్ఠులు నిర్వహించేవారన్నారు. కృష్ణ రాయల వైభవాన్ని ప్రస్తుత తరానికి చాటి చెప్పాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డా.సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర, కన్నడ భాషల్లో తిరుగు లేని భాషాకవి చక్రవర్తి కృష్ణదేవరాయలని అన్నారు. కార్యక్రమంలో తూము సుబ్బారావు, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మిడసల మల్లికార్జున రావు, జి.ఓబుల్ రెడ్డి, మాగంటి శ్రీనివాసమూర్తి, మెడబలిమి సాంబశివరావు, డా.మొగిలి దేవప్రసాద్, పి.గోవర్ధన్ రెడ్డి, ఐ.మురళీకృష్ణ, మద్దులూరి వెంకట సుబ్బారావు, వల్లెపు మురళి, కొప్పోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల తో నివాళులర్పిస్తున్న వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు



చందన అలంకరణలో దర్శనమిస్తున్న విజయ గణపతి



ప్రత్యేక అలంకరణలో సిద్ధి బుద్ధి సమేత విజయ గణపతి

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీనగర్ కాలనీ మొదటి వీధిలో వేంచేసి ఉన్న విజయ గణపతి స్వామి దేవాలయంలో మాఘమాసం ఆదివారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం హస్తా నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు గణపతి మూలవిరాట్కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. చందన అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, శుద్ధి పుణ్యాహవాచనా, స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదాతలు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనగర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు. శ్రీమాన్ వలివేటి సుబ్రహ్మణ్యం స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వైద్యశాఖ ముమ్మర ఏర్పాట్లు



బందోబస్తుపై డీఎంహెచ్ఓతో చర్చిస్తున్న ఎస్సై శివరామయ్య

మద్దిపాడు: క్యాన్సర్ స్క్రీనింగ్పై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఏడుగుండ్లపాడులో నిర్వహించనున్న కార్యక్రమానికి పనులు వేగవంతం చేశారు. ఈ నెల 18వ తేదీ మంగళవారం ఏడుగుండ్లపాడులో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా హెల్త్ వెల్నెస్ సెంటర్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్ఓ టి.వెంకటేశ్వర్లు స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామ సెంటర్లో ఉన్న రచ్చబండ వద్ద ప్రజలతో వైద్యశాఖ మంత్రి సత్య కుమార్, సినీ నటి గౌతమి క్యాన్సర్పై ముఖాముఖిగా మాట్లాడి అవగాహన కల్పిస్తారని డీఎంహెచ్ఓ తెలిపారు. తదుపరి గ్రామంలో ఉన్న వెల్నెస్ సెంటర్ ను పరిశీలించి అక్కడ సినీనటి గౌతమితో క్యాన్సర్ పై అవగాహన కోసం ఒక వీడియో ప్రోమోను చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం జరగనున్న కార్యక్రమానికి బందోబస్తు విషయమై స్థానిక ఎస్సై శివరామయ్యతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్తో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయ్కుమార్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిల్పా సౌందర్య మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య శాఖ వైద్యులు శ్రావణ్ కుమార్ జగదీష్, ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి



గాయపడిన వారిని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీమకుర్తి: మండలంలోని బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు తొరటి ఆనంద్, బొంతా ఏసుదాస్, బిరుదుల లింగయ్య, కర్నా ప్రసాద్, బుట్టి సాల్మన్, నాగభూషణం డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళలు కొమరగిరి వెంకటేశ్వరమ్మ, చలంచర్ల దుర్గ, చేవూరి సుబ్బమ్మను పరామర్శించారు. రెండు రోజుల క్రితం బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రెడ్డి సామాజికవర్గ మహిళలు గిరిజన మహిళలపై కారం చల్లి కర్రలతో దాడి చేయడంతో చీమకుర్తి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసు నమోదైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

18న విద్యుత్ అదాలత్

ఒంగోలు సిటీ: డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18వ తేదీ ఒంగోలు డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ మాకినేని హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులకు ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ అవగాహన సదస్సు ఉదయం 10 గంటల నుంచి 1.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ అధికారులు ఈ అదాలత్లో పాల్గొంటారని చెప్పారు. ఒంగోలు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, మద్దిపాడు, టంగుటూరు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని వినియోగదారుల ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నంబరు పూర్తి అడ్రస్తో తమ సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు.

పొగాకు బ్యార్నీ దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

మద్దిపాడు: దొడ్డవరప్పాడులో బెజవాడ వెంకటేశ్వర్లు చెందిన పొగాకు పొగాకు బ్యార్నీ దగ్ధమైన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రమాదవశాత్తు పొగ గొట్టంపై పొగాకు కర్ర పడిపోయి ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందాయి. దాదాపు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. దాదాపు 290 పొగాకు కర్రలు అగ్నికి ఆహుతయ్యాయని రైతు బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. దాదాపు రూ.5 లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించిందని వాపోయారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని పొగాకు రైతులు నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జిల్లా కార్యదర్శిగా గుడ్డపాతల రవి



గుడ్డపాతల రవిని అభినందిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శిగా ఎంపికైన గుడ్డపాతాల రవిని ఆదివారం సాయంత్రం సంతనూతలపాడు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున శాలువా కప్పి అభినందించారు. రవి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగు నాగార్జున, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ కార్యదర్శి ఒక కోటిరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

పామూరు: మండలంలోని గోపాలపురం వద్ద 565 జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన పార్వతీ పరమేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అర్చకుల వేద మంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న పార్వతి, పరమేశ్వరుడు, సుబ్రమణ్య, వినాయక, అయ్యప్ప, నవగ్రహ విగ్రహ మూర్తులకు ఆదివారం జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, వస్త్రాదివాసం వేదపండితులు శ్రీచిమటా కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, స్వామి శాంతి కల్యాణం, గ్రామోత్సవం జరగనున్నాయి.



ఉత్సవానికి సిద్ధమైన పార్వతి, పరమేశ్వరుల ఉత్సవమూర్తులు

కార్మిక శాఖ తనిఖీలెక్కడ..?

- డాబాల్లో చిన్నారుల బాల్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఉలవపాడు: పాఠశాలకు వెళ్లి పుస్తకాలు పట్టాల్సిన చేతులు డాబాల్లో ప్లేట్లు, గ్లాసులు పట్టుకుంటున్నాయి. వారి కుటుంబ పేదరికం కావచ్చు.. ప్రభుత్వ నిర్లక్ష్యం కావచ్చు.. మొత్తంమీద బాల కార్మికులు మాత్రం అధికమయ్యారు. బడికి వెళ్లకుండా పనులకు వెళుతున్న పరిస్థితులు మండలంలో అధికంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారి వెంట డాబాల్లో అత్యధికంగా చిన్నారులు పనిచేస్తున్నారు. వారిలో కొందరు స్థానికులు కాగా, మరికొందరు ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందినవారు. ఈ హోటళ్లకు ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాలలో ఉన్నవారు వస్తుంటారు. కానీ, వారందరూ పనిచేయించుకోవడం తప్ప బాల్యంలో ఇక్కడ ఎందుకు పనులు చేస్తున్నారనే విషయం మాత్రం పట్టించుకోరు. ఇక, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం పనిచేయాల్సిన కార్మిక శాఖ, విద్యాశాఖ కనీసం పట్టించుకోని పరిస్థితి. జాతీయ రహదారిపై ఎలాంటి హోటళ్లు, డాబాలు నిర్వహించాలన్నా తమ వద్ద ఎలాంటి బాల కార్మికులు లేరని కార్మిక శాఖ నుంచి హోటల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ, అలాంటివేవీ ఇక్కడ ఉండవు. కార్మిక శాఖ అనుమతి ఉండదు. ఇలా ఎందరో భావిభారత పౌరుల బాల్యం హోటళ్లలో మగ్గిపోతోంది.

అధికారుల నిర్లక్ష్యం...

ప్రధానంగా కార్మిక శాఖ, విద్యాశాఖ నిర్లక్ష్యం వలనే ఈ పరిస్థితి ఉందనేది వాస్తవం. కార్మికశాఖకు సంబంధించిన అధికారులు ఒక్కసారి కూడా జాతీయరహదారిపై ఉన్న డాబాలు, హోటళ్లను, దుకాణాలను తనిఖీ చేసిన సందర్భమే లేదు. గతంలో చైల్డ్లైన్ సంస్థ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతుండేవి. ఇప్పుడు వారి తనిఖీలు కూడా ఎక్కడా లేవు. కార్మిక శాఖకు సంబంధించిన అధికారులు మీ సేవ ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే ఎలాంటి పరిశీలన లేకుండానే అక్కడ బాల కార్మికులు లేరని సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. కానీ, జాతీయరహదారిపై ఉన్న దాబాలలో కనీసం ఆ సర్టిఫికెట్కు దరఖాస్తు కూడా చేయరు. ఒక్క హోటల్కు కూడా అనుమతులు ఉండవు. అయినా గ్రామ పంచాయితీగానీ, కార్మిక శాఖగానీ, విద్యాశాఖగానీ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఏ మాత్రం కృషి చేయని పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. మరోవైపు పాఠశాలల్లో డ్రాపవుట్లు అధికమవుతున్నారు. ప్రధానంగా గిరిజన కాలనీలలో చిన్నారులు పాఠశాలకు వైపు చూడకుండా పనులకు వెళుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో అధికారులు తనిఖీలు చేసి బాల కార్మికులను విద్య వైపు మరల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.